క్రుంగిపోతున్న సూర్యుడు, తన ఆఖరి వెలుగుల్ని, నారింజ రంగులో లోకం మీదికి వొంపుతున్నాడు.

సముద్రపు అలల మీదుగా వీస్తున్న చిరుగాలికి ముఖం మీద పడుతున్న ముంగురుల్ని మునివేళ్ళతో సవరించుకుంటూ ప్రక్కనున్న రాజశేఖర్ ముఖంలోకి తదేకంగా చూస్తోంది సౌఖ్య. అతని దృష్టి మాత్రం, ఎదురుగా వున్న కడలి ఆవలి తీరాన్ని వెదుకుతున్నట్లుగా ఎక్కడో వుంది.

ఓ అల్లరి అల, బుజ్జిబుజ్జి అడుగుల్తో గెంతులేసే పాపాయిలా, తీరాన్ని చేరి, సౌఖ్య పాదాల్ని చుటుక్కున చుంబించి గబగబా వెనక్కి పారిపోయింది. తడిసిన ఆమె తెల్లని పాదం, తమలపాకులా లేతగా మెరుస్తోంది.

# ఇసుకలో ప్రేమలేఖ

గుమ్మడి రవీంద్రనాథ్



"సముద్ర జలాల మీదేమైనా పరిశోధనలు చేస్తున్నారా ఏమిటి? అంతగా చూస్తున్నారు? పక్కన నేనొకదాన్ని ఉన్నాను" సౌఖ్య అన్న ఆ మాటతో, రాజశేఖర్ ఆమె వైపు తిరిగాడు.

"నీ గురించే ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"ఆ ఆలోచించేదేదో నా కళ్ళలోకి చూస్తూ ఆలోచించుకోవచ్చుగా. అయినా ఇంట్లో ఒంటరిగావేగా మీరుండేగి అప్పడాలోచించుకోండి. దిండు పట్టుకుని, నన్నూహించుకుంటూ మాంచి ఫాంటసీల్ని ఊహించుకోండి. ఇప్పడు మాత్రం నోరు విప్పి నాతో ఏదో ఒకటి మాట్లాడండి. ఈ సాయంకాలాన్నీ ఈ సాగర తీరాన్నీ అడవిన కాచిన వెన్నెల్ని చేయొద్దు" ఆమె మాటలకతడు చిన్నగా నవ్వాడు. ఆ నవ్వు ఫిలాసఫికల్‌గా వుంది.

"కామన్ కోల్డ్ అండ్ ఇన్‌ఫాచ్యుయేషన్ విల్ టేక్ దెయిర్ వోన్ కోర్స్"

అతని మాటలోని భావం అర్థం అవ్వగానే మనస్సు చివుక్కు మంది సౌఖ్యకు.

"మీరు మామూలు జలుబూ రొంపలతో పోల్చిన ఆ ఇన్‌ఫాచ్యూయేషన్‌కీ, నిజమైన ప్రేమకీ తేడా తెలీని దానిలా కన్పిస్తున్నానా నేను?"

"లేకుంటే మరేమిటిదంతా? నీ తండ్రి వయస్సున్న నా మీద నీకీ పిచ్చేంటి ప్రేమేంటి?"

"పిచ్చికాదు. ప్రేమ! పిచ్చి ప్రేమ! అయినా ఎవరి పిచ్చి వాళ్ల కానందం లెండి. మిమ్మల్ని నా పిచ్చిలోకి లాగుతాను చూస్తూండండి."

అప్పడు చూశాడతను. ఇందాక తడిసిన ఆ ఇసుక మీద వేళ్ళతో ఆమె వ్రాసిన మూడు మాటల్ని.

"నాకు మీరు కావాలి."

::::::

అర్థరాత్రి దాటినా ఆలోచనల 'దాడి'ని తప్పించుకోలేక పోతోంది, రాజశేఖర్ మనసు. నిద్రమాత్రలు మింగినా లోపలి అలజడి సర్దు మణగటం లేదు. గదిలో ఒంటరిగా పడుకుని ఉన్నాడు అతను. ఆ గదిలోనే కాదు ఎన్నో గదులున్న ఆ అధునా తన భవంతిలోనే అతడు ఒంటరి. నిద్రలేమికి ఆ ఒంటరి తనం కాదు కారణం. ఆరేళ్ళ క్రిందట ఆరంభమైన ఈ ఏకాకితనానికి అతడు అలవాటు పడిపోయేడు.

అసలు, ఆరేళ్ళ క్రిందటి వరకూ భార్య, కాశ్మీర, పిల్లలు– ప్రియాంక, అపూర్వలతో కళకళ్ళాడుతూ ఉన్నదే ఆ ఇల్లు. భార్యా భర్త లిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూండంతో, ఆర్థికంగా ఏ ఇబ్బందులూ లేకుండా హాయిగా సాగిపోయే ఆ సంసారంలోవిధి విషాగ్నుల్ని చిమ్మిందో రోజు. వైజాగ్ రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ ఉద్యోగినిగా పని చేస్తున్న అతని భార్య, ఓ రోజు ఆ భవనంలో సంభవించిన బాంబు పేలుడులో దారుణంగా చనిపోయింది.

ఏ ఉగ్రవాద చర్యో మరే అంతర్జాతీయ కుట్రోగానీ ఎనిమిది అమాయక ప్రాణాలు బలై పోయాయి. బాంబు బ్లాస్ట్‌లో భార్య చనిపోయిందన్న వార్త తెలిసిన రాజశేఖర్, పిల్లల్నిద్దర్నీ తీసుకుని కార్లో, రైల్వే స్టేషన్‌కి వస్తుండగా, ఓ ఇసుక లారీ కారుని ఢీ కొంది. ఆ ప్రమాదంలో అతను బ్రతకడం ఎంత దైవికమో, కన్న బిడ్డలిద్దరూ అతని చేతుల్లోనే, కళ్ళ కెదురుగానే రోడ్డు మీదే తలలు వాల్చేయడం అంత ఘోరం! చిన్న కూతురు అపూర్వ, ప్రాణాలు విడుస్తూ కూడా,'అమ్మ దగ్గరకు తీసుకెళ్ళండి డాడీ' అనడం అతడి విషాదానికి పరాకాష్ట!

గుండెలు పగిలే అంత దారుణమైన బాధను దిగమింగుకోవడానికి చాలా కాలం పట్టిందతనికి.

కూడ బలుక్కున్నట్లు, ముగ్గురూ ఒకేసారి వెళ్ళిపోయి అతడ్ని ఒంటరిని చేసేశారు వాళ్ళు. ఆ నాటి నుండీ ఆ ఒంటరి తనమే అతనికి తోడూ నీడా అయింది.

అదే, అతన్ని అన్ని వేళలా అంటి పెట్టుకుని

వుంటో ప్రియ నేస్తమైంది.

అందుకే అది అతడ్ని బాధించదు.

అతన్నిప్పుడు అంతగా వ్యాకుల పరుస్తున్న విషయం వేరు. అదో వింత సమస్య. నలభై ఏడేళ్ళు నిండిన ఈ వయసులో ఓ పంతొమ్మిదేళ్ళ ఆడపిల్ల



అతన్నిష్టపడటం! ఇష్టపడటం కాదు ప్రేమించడం!! అంతేకాదు, పెళ్ళి చేసుకోమని పిచ్చిగా తన వెంట పడటం!

అదీ ఆ సమస్య.

అతను ఆలోచిస్తున్నాడు.

పత్రికలలో అప్పుడప్పుడూ తను వ్రాసే కథల్ని చదవడం ద్వారా ఏర్పడ్డ అభిమానం రెండు నెలల క్రితం చిరు పరిచయంగా మొదలైంది. ఆ పరిచయమే ఇప్పుడిలా ఓ చిక్కు ముడిలా పరిణమిస్తుందని వూహించలేదు తను!

ముందు అనుకున్నాడు– తన రచనల మీద ఏర్పడ్డ 'అభిమానం' ఆ రచనల్ని సృష్టించే తను

పరిచయం కాగానే రచన మీద 'అభిమానం' కాస్త వ్యక్తి మీదకి దారి మళ్ళిందేమోనని!! ఆ విశ్లేషణే నిజమైతే, ఆమెను మళ్ళీ సరైన మార్గాన పడ వేయడం ఏమంత కష్టం కాదులే అనుకున్నాడు. కానీ తన అంచనా తప్పింది.

వయస్సుకు మించిన మానసిక పరిపక్వత ఉందామెలో. టీనేజి ఆకర్షణలకీ, స్వచ్ఛమైన ప్రేమలకీగల నిజమైన అర్థాలు ఆమెకు తెల్సు. ఆ అమ్మాయి తనను నిజంగానే ఆరాధిస్తోంది.

తనకన్నా చాలా ఎక్కువ వయస్సున్న మగాడి మీద మోజు పడటం అనే మానసిక వైపరీత్యం కాదది. ఎలక్ట్రాకాంప్లెక్సూ కాదు! ఆమె కోరికలో ఓ నిజాయితీ కనిపిస్తోంది.

కానీ... అంత చిన్న పిల్లతో, పెళ్ళంటే లోకం హేళన చేస్తుంది.

అసలామె 'పైత్యం'ఏదో 'ప్రేమ' వరకూ ఆగితే బాగుండేది. కానీ పెళ్ళి చేసుకోమంటోంది!! అదీ సమస్య తాలూకు పరాకాష్ట! ఎందుకో, ఏ కారణంగానో మరి ఆ పిల్ల మనస్సులో తనపై ప్రేమ మొలకెత్తింది. ఆ మొలక పెరిగి పెద్దదై, ప్రేమ పాదుగా మారి, పెళ్ళి పూలు పూయాలని పరితపిస్తోంది.!

ఆ పువ్వు ఫలించకూడదు. మొగ్గగానే చిదిమివేయాలి.

వేకువ అవుతుండగా అప్పుడు నిద్రలోకి జారాడు రాజశేఖర్.

:::::

ఆ వేళ ఆదివారం. ఆఫీసు ఉన్న రోజుల్లో, ఉదయం అల్పాహారాన్ని కూడా ఆఫీసు క్యాంటీన్‌లోనే తినేవాడు రాజశేఖర్. బయటికి వెళ్ళి తినాలని పించక, ఆ రోజు ఇంట్లోనే ఉండి పోయాడు. అదీకాక బయట వాన కురుస్తోంది. అప్పుడు టైము పదకొండు గంటలు. ప్రొద్దున ఒక గ్లాసుడు పాలు మాత్రం తాగాడు అంతే.

కాశ్మీర బ్రతికి వున్న రోజుల్లో ఒక్కోసారి ఆదివారాలు కూడా డ్యూటీకి వెళ్ళ వలసి వచ్చేది. అలాంటప్పుడు అలారం పెట్టుకుని తెల్లవారు ఝామునే లేచి తనకూ పిల్లలకూ అన్నీ చేసిపెట్టి అప్పుడు బయల్దేరేది. ఆదివారం పనికి వెళ్ళాల్సినప్పుడు చాలా అయిష్టంగా బయల్దేరేది. ఇంట్లోని తననూ పిల్లల్నీ వదల్లేక వదల్లేక ఇల్లు విడిచేది. అలా వెళ్తూ, ఓసారి ఆమె అన్న మాట గుర్తొచ్చింది.

'అయ్ లవ్ మై స్వీట్ హోమ్- హోమ్ దట్‌మై ఫీట్ మే లీవ్ బట్ నాట్‌మై హార్ట్'

భార్య జ్ఞాపకానికి అతడి కన్నులు సజలాలయ్యాయి.

ఇంతలో కాల్‌బెల్ మోగితే లేచి వెళ్ళి తలుపు తీసాడు.

ఎదురుగా సౌఖ్య. వర్షానికి పూర్తిగా తడిసి పోయి వుంది!

"రా లోపలికి"

"థాంక్స్" అంటూ లోనికి అడుగు పెట్టింది. "ఏం చేస్తున్నారు? కొత్త కథేమైనా వ్రాస్తున్నారా?" అడిగింది నిల్చునే.

"ముందా బట్టలు తీసి వేరేవి కట్టుకో" తువ్వాలు ఆమె కిచ్చి చెప్పాడు.

"ఆ గదిలో అల్మెరాలో వున్నాయి చీరలు. కాశ్మీరవి." చూపించాడు.

అతడి మాటలు వినని దానిలా అక్కడున్న కుర్చీలో అలా తడిబట్టలతోనే కూర్చుంది సౌఖ్య.

"మీరు చెప్పినట్లు తీయమంటే తీస్తాగానీ వేరేవి కట్టుకోను" కొంటెగా అంది. ఆ మాటకో క్షణం ఉలిక్కి పడ్డాడు రాజశేఖర్. అప్రయత్నంగా అతని చూపు ఆమె మీద నిలచింది.

ముదురు ఆకుపచ్చ చీరలో ముగ్ధ మనోహరంగా మెరిసి పోతోంది ఆమె.

వ్యవసాయ శాస్త్రజ్ఞులు, హైబ్రిడైజేషన్ ద్వారా సృష్టించిన ఓ అపురూపమైన గులాబీ పువ్వులా వుంది ఆమె సౌందర్యం.

అప్పుడే తొడిమ తెరుచుకున్న మందార మొగ్గలా వున్న ఆమె అధరం, జుంటితేనె వడ్డించిన పూల విస్తరిలా వుంది. చెక్కిలి మీద నుండి ఓ వాన చినుకు చటుక్కున జారి, జాకెట్టు అంచులో అదృశ్యమైంది.

"అలా తడిబట్టల్తో ఎక్కువ సేపుంటే జలుబు చేస్తుంది"

"జలుబు చేస్తుంది సరే, మీరు మాత్రం ఏమీ చేయరా? అయినా , ఇలా బాగోలేనా?"

"బాగోకేం, బుషుల్లో కూడా సంచలనాల్ని రేపేంత అందంగా వున్నావ్. సరేనా?"

"ఎందుకంత కోపం? పైకి కోపం పూత పూసినా మీరన్న మాటలో నిజం వుందని మీకు తెల్సు. అయినా నేనేం అన్నాను. మీరు మాత్రం ఏమీ చేయరా అన్నాను అంతేగా! చేయలేరు అన్లేదుగా. నాకు తెల్సులెండి- యు హేవ్ వోన్లీ గ్రోన్ అప్- నాట్ ఏజ్ వోల్డ్!"

ఆ మాటలు అతడినో క్షణం తికమక పెట్టాయి. తలపైకెత్తి ఆమె నింకొక సారి చూడాలన్న కోరికను బలవంతంగా అవుకుంటున్నాడు.

ఉన్నట్టుండి, కుర్చీలోంచి లేచి, రాజశేఖర్ దగ్గరగా వచ్చి, అతని పెదవుల మీద చటుక్కున ముద్దు పెట్టేసింది సౌఖ్య.

నాలుగు పెదాలు ఒక్కటై- 'ముద్ద'యింది.

అతడి శరీరం కాంక్షతో తడిసి- ముద్దయింది!

క్షణంలో తేరుకుని ప్రక్కకు జరిగాడు రాజశేఖర్.

అప్పుడు చెప్పింది సౌఖ్య.

"యువర్ వర్త్ ఈజ్ నాట్ మెజర్డ్ బై వాట్ యు హేవ్ గాట్, బట్ బై వాట్‌యుగివ్"

ఆమాట వెనుక వున్న ఉద్దేశ్యం అర్థమైంది అతడికి. ఆమె ఇచ్చిన ముద్దుకి, బదులివ్వమని సున్నితంగా చెబ్తోంది. అతడి గుండె వేగంగా కొట్టుకుంటోంది.

తన 'వర్త్' ఏవిటో ఆమెకు తెలియ చేయాలన్నట్లుగా ఆమెను తన బాహువుల్లోకి తీసుకున్నాడు రాజశేఖర్!!

ఆ తర్వాత సరిగ్గా పది రోజుల్లో సౌఖ్య మెడలో తాళికట్టాడు రాజశేఖర్. దండలు మార్చుకుం

డా॥ కె. కిరణ్ కుమార్

దాంలే అన్న అతడి ప్రతిపాదనను కాదని పట్టుబట్టి మంగళ సూత్రం కట్టించుకుంది సౌఖ్య. ఓ దేవాలయంలో ఏ ఆర్భాటాలూ లేకుండా జరిగిపోయింది. సౌఖ్య మొండి తనమూ పట్టుదలా తెలిసిన ఆమె తల్లితండ్రులు, కూతురు మాటకు ఎదురు చెప్పలేక ఆ వివాహానికి హాజరైనా, దానికి వాళ్ళిద్దరూ మనస్ఫూర్వకమైన ఆమోదముద్ర వేయలేదని తెలుస్తూనే వుంది రాజశేఖర్‌కి.

రాజశేఖర్‌లో ఓ అంతర్యుద్ధం సాగుతోనే వుంది. ఆ వర్షం రోజు అలా జరక్కపోయి వుంటే ఇవ్వడీ పెళ్ళి తంతుకి తను ఒవ్వకునేవాడు కాదసలు.

ప్రేమనేది ఎవ్వడు, ఎవరి మీద, ఎందుకు జనిస్తుందో చెప్పలేమనీ, ప్రేమ ఆవిర్భావానికి పెద్ద రీజనింగూ లాజిక్ లాంటివి ఓండనవసరం లేదనీ అతనికి తెల్సు. అయినా ఆ అమ్మాయి ప్రేమకు, తను అన్ని విధాలా అనర్హుడు. తను అందగాడు కాదు, ఆస్థి పాస్తులున్నా, వయస్సులో లేనివాడు. మధుమేహం, రక్తపోటు లాంటి శారీరక రుగ్మతలతో బాధపడ్తూ వృద్ధాప్యం దశలోకి తరలి పోతున్నవాడు.

అలాంటి తనకు, అంతటి అద్భుత సౌందర్య రాశి, సర్వార్పితమస్తు ఐపోవడం అన్నది ఒట్టి మూర్ఖత్వం తప్ప మరోటి కాదు.

ప్రేమలోని గుడ్డితనానికి పరాకాష్ట ఇదా!

అసలీ ప్రేమన్నదానికి కూడా కొంచెం తెలివీ, కొంచెం లౌక్యం, కొంచెం స్వార్థం లాంటివి ఉండా లేమో!

'స్వార్థం' అన్న మాట మనస్సులో మెదలగానే, అకస్మాత్తుగా అతన్నో ఓ అనుమానం మొలకెత్తింది!

అసలు ఇదంతా, చాలా ప్లాన్డ్‌గా, తన ఆస్థి కోసం పన్నుతున్న కుట్రలో భాగం కాదు గదా?! నేర్పుగా పన్నుతున్న అందమైన పంచన వలలో తను అమాయకంగా ఇరుక్కుపోవడం లేదుకదా?

ఆ ఆలోచనతో అతడు ఉలిక్కిపడ్డాడు. ఇక నుండి తన 'జాగ్రత్త'లో తను వుండాలని నిర్ణయించుకున్నాడు.

## ✪చెప్పినట్టే చేశా✪

"ఇదేంట్రా, పిచ్చయ్యా! ఓటు పెట్టెలో వేయకుండా తెచ్చి నాకిచ్చావు"

"బాబూ! మొన్న మీటింగులో తమరే సెప్పినారు కదా మీ అందరి ఓట్లూ నాకియ్యండి అని. మీరు చెప్పినట్టే చేశా"

– వి.వి.శీతారామదాసు,
గుంటూరు.

సౌఖ్య మాత్రం 'కన్నెపిల్ల' స్థాయి నుండి, 'అర్థాంగి' హోదాకి ఎదిగిన అనుభవంలోని మాధుర్యాన్నీ, తృప్తినీ అనుభవిస్తోంది.' అయ్ డోన్ట్ రిమెంబర్ డేస్, అయ్ రిమెంబర్ మొమెంట్స్' అన్నంత అవురూపంగా!

::::

మొదటి భార్య కాశ్మీర మరణించిన తర్వాత, తనకు మిగిలిన ఒంటరి తనవు ఉక్కుకోట వునాదులతో సహా కువ్వ కూలిపోయినట్లనిపిస్తోంది రాజశేకర్‌కు– సౌఖ్య ఇంట్లో అడుగు పెట్టాక. ఆరేళ్ళుగా గూడుకట్టుకున్న గుండెల్లోని స్తబ్ధత పటాపంచలైపోయింది. నిస్సారంగా నలిగిపోతున్న జీవితం వాకిట్లోకి, వేయి వసంతాలు ఒక్కసారిగా అడుగిడిన భావన!

తన ప్రతి చిన్న అవసరాన్నీ కనిపెట్టి, తను నోరు తెరిచి అడిగే అవసరం లేకుండానే, సమస్తం సమకూర్చుతోంది సౌఖ్య.

భోజనం కూడా తన చేతుల్తో చేయడం లేదు. ఆమె కలిపి ముద్దలు తినిపిస్తోంది. "ఏమిటిది? ఏదో మంచాన పడ్డ రోగికి తినిపిస్తున్నట్లు?" అని అతనంటే–

"నా కిందులో ఓ తృప్తి వుంది. ఓ త్రిల్లుంది. లెట్ మీ డూ ఇట్ ప్లీజ్" అనేస్తోంది. వంటకాల్లో, తన కిష్టమైన వేవో తెలుసుకొని అవన్నీ ఓ లిస్ట్ తయారు చేసుకుని, చేసి పెడ్తోంది.

తను హైపర్ టెన్షన్‌కి వాడే మందులు క్రమం తప్పకుండా ఇవ్వడం, తల దువ్వడం, చొక్కా గుండీలు పెట్టడం, తలస్నానం చేయించడం, షూ లేస్ ముడి వేయడం, వేళ్ళ గోళ్ళు కత్తిరించడం, ఇలా అతనికి సంబంధించిన అన్ని పనులూ ఆమె, ఎంతో ఇష్టంగా చేస్తోంది. 'ఒక స్త్రీ తన జీవితాన్ని తన భర్తకు అంకిత మిచ్చింది' అన్న మాటను క్రియాత్మకంగా నిర్వచిస్తోన్నట్లుంది ఆమె ప్రవర్తన!

ఆమె తనకు అందిస్తున్న సుఖాల్నీ, సపర్యల్నీ మౌనంగా, 'స్వీకరి'స్తున్నాడే తప్ప, వాటిని ఆమెకు కాస్తలో కాస్సైనా 'తిరిగి ఇవ్వలేక' పోతున్నాడు! దానిక్కారణం– ఇదంతా, ఒక నాటకమనీ, తన ఆస్తికోసం పన్నిన పథకం లోని భాగమేమో అన్న అనుమానం అతడిలో దూరమవ్వకపోవడం!

"టు బిలీవ్ విత్ సెర్టనిటీ, యుమస్ట్ బిగిన్ విత్ డౌటింగ్" అన్నట్లే వుంటున్నాడు!!

ఆ అనుమానం నిజమా కాదా అన్న సంగతి వారం తర్వాత అతనికి తెల్సింది!!

ఆ రోజు–

::::

రాజశేఖర్ ఆఫీస్‌కి, సౌఖ్య తల్లి తండ్రులువచ్చారు.

అతడు వాళ్ళను అనుమ నంగా చూస్తూ, తన ఛాంబర్‌కి తీసుకువెళ్ళి "బాగున్నారా?" అని పలకరించాడు. వాళ్ళు వెంటనే బదులు చెప్పలేదు.

అసలు వాళ్ళు ఇంటికి వెళ్ళకుండా ఆఫీస్‌కి ఎందుకు వచ్చారా అని ఆలోచిస్తున్నాడు రాజశేఖర్. ఏదైనా డబ్బు సాయం కోసమేమోనన్న అనుమానం కలిగిందతనికి వెంటనే. వీళ్ళ కుట్రతాలూకు రెండో భాగం మొదలవబోతోంది!!

"సౌఖ్య ఎలా వుంది బాబూ" కొన్ని క్షణాల మౌనం తర్వాత సౌఖ్య తండ్రి నోరు విప్పాడు.

"బానే వుంది "

స్వీట్ సెన్సేషన్
అతి త్వరలో కొత్త సీరియల్

"దాని పోరు పడలేకే మీరు పెళ్ళికి ఒప్పకు నుంటారని మాకు తెల్సు. వొద్దన్నా వదలక మిమ్మల్ని సాధించిందని దాన్ని చులకనగా చూడ కండి. అది చిన్నపిల్ల. నాది చిన్న ఉద్యోగమే అయినా ఒక్కతే కూతురవ్వడంతో గారాబంగానే పెంచాను. అదేదైనా తెలీక తప్పచేస్తే చూసీ చూడ నట్లు వదిలేయండి. దాని మనసు కష్టపెట్టొద్దు. ఏ మరుపాటున కూడా దాన్ని ఏమీ అనొద్దు."

ఆ మాటలు పైకి ఓ తండ్రి, తన కూతురి పట్ల మమకారంతో చెప్తున్న మాటల్లానే వున్నా వాటి వెనుక ఇంకేదో ఉన్నట్లనిపించింది, రాజశేఖర్‌కి.

"ఎందుకింత ప్రత్యేకంగా చెప్తున్నారు. అసలే మైంది?" అతడిలా సూటిగా అడిగేసరికి, తడబ డ్డాడాయన. ఏదో సంకోచం, తటపటాయింపు ఆయన కళ్ళల్లో కనిపిస్తున్నాయి.

భార్య వారించబోవడాన్ని కూడా లక్ష్య పెట్ట కుండా చెప్పసాగాడు సౌఖ్య తండ్రి.

"ఎట్టి పరిస్థితుల్లోనూ మీకీ విషయం తెలియ నీయం అని సౌఖ్యకు మాట ఇచ్చినా ఎందుకో మీకీ విషయం చెప్పకుండా వుండలేమనిపిస్తోంది.

సౌఖ్య లివర్‌కి సంబంధించిన ఓ ప్రాణాంతకమైన జబ్బుతో బాధ పడుతోంది బాబు! బైలియర్ అట్రేసియా' అనే ఆ జబ్బుకి మందులేదట. చావు కోసం ఎదుర్చూస్తూ బ్రతకడమే! సరిగ్గా దానికి తన జబ్బు విషయం తెల్సిన సమయంలోనే మీ పరిచయ మవ్వడం జరిగింది. మీ భార్య, ఇద్దరు పిల్లలూ ఒకే రోజు కొన్ని నిమిషాల వ్యవధిలో, రెండు వేర్వేరు ప్రమాదాల్లో మరణించిన విషాదం దాన్ని బాగా కదిలించింది. భగవంతుడు తనకు మిగిల్చిన 'కొద్ది పాటి జీవితాన్ని' నిరుప యోగం కానివ్వకూడదనీ, తను బ్రతికు న్నన్నాళ్ళూ ఓ మనిషికి ఉపయోగడాలనీ కోరుకుంది. విధి చేత కుదించబడిన తన జీవితాన్ని 'వృథా' పోనివ్వక, మరో మనిషి జీవితానికి సుఖ సంతోషాల్ని వ్వడం కోసం 'ఖర్చు' పెట్టాలనుకుంది. మీ కథల పట్ల వున్న అభిమానమే కారణమో ఏమో గానీ మిమ్మల్ని ఎంచుకుంది. ఇందులో ఆమె స్వార్థమూ లేకపోలేదు. పెళ్ళి అనే ఓ అనుభవాన్ని పొందాలనే స్త్రీ సహజమైన స్వార్థం అది. మీకు తోడై నిలిచి మిమ్మల్ని సంతోష పెట్టాలన్నదే ఆమె లక్ష్యం అసలు. ఆ లక్ష్య సాధనకోసం చేసే ప్రయత్నంలో తన మెడలో తాళిబొట్టు పడటం అన్నది కేవలం కాకతాళీయంగా జరిగే ఓ సంఘటనగా మాత్రమే మిగలాలనుకుంది. అంతే! తన మనసుకు తోచిన ' మంచిపని' ని సాధించడంలో ఆమె పొందే ఆత్మతృప్తిని ఆమెకు మిగల్చాలంటే, మేము మీకీ విషయాన్ని చెప్తేసేం అని, చని పోయే వరకూ సౌఖ్యకు తెలియకూడదు. తెలిస్తే అది భరించలేదు. తను ఎక్కువ కాలం బ్రతక దన్న నిజం మీకు తెలిసి పోయిందని ఆమెకు తెలిస్తే తన లక్ష్యానికి అర్థం లేకుండా పోతుం దని కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంది. మిమ్మల్ని 'మోసం' చేసినట్లుగా భావించి అపరాధ భావనతో నలిగి పోతుంది. మేము దాని ముందు తల ఎత్తు కోలేం. ఆ క్షోభ అది తట్టుకోలేదు. బ్రతికే నాలుగు రోజులూ సంతోషంగా బ్రతకాలి అది."

కోటి క్షిపణుల విస్ఫోటనం గుండెల్ని కాల్చేసిన దిగ్భ్రమతో అచేతనంగా ఉండి పోయాడు రాజశేఖర్.

ఇంత మహోన్నతమైన ఆశయంతో తనను కోరి వచ్చిన ఆమె గురించి ఎంత నీచంగా ఊహించాడు తను? తన ఆస్తికోసం కుట్రపన్ని, సెడ్యూసర్‌లా ప్రవర్తించిందని ఎంత తేలిక భావంతో ఆమెను చూసాడు?

"యువర్ వర్త్ ఈజ్ నాట్ మెజర్డ్ బై వాట్ యు హేవ్ గాట్, బట్ బై వాట్ యుగివ్"

ఆ రోజు ఆమె మాటల్లోని నిజమైన లోతులు ఇప్పుడు అర్థమౌతున్నాయతనికి! ఓ కన్నీటి పొర అతని కళ్ళను అడ్డుకోవడంతో ఎదురుగా వున్న సౌఖ్య తల్లి తండ్రులు మసగ్గా కన్పిస్తున్నారు!!

ఆ సాయంత్రం త్వరగా ఆఫీస్ నుండి ఇంటికొచ్చేసాడు రాజశేఖర్.

బయట లాన్‌లో కూర్చుని స్వెటర్ అల్లుతూ కనిపించింది సౌఖ్య. కారు పార్క్ చేసి వచ్చి, ఆమె కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

నారింజ రంగు నీరెండ వెలుగు పడటం వల్ల, మరింత ప్రకాశవంతంగా మెరిసి పోతోందామె ముఖం.

"శీతాకాలం వస్తోందిగా, మీ కోసమే ఇది అల్లు తున్నాను" అంది అతన్తో. అతడు ఆమె ముఖం లోకి తదేకంగా చూస్తున్నాడు– రెప్ప వాల్చకుండా.

"కాఫీ పట్టుకొస్తానుండండి" అంటూ లేవబో తున్న సౌఖ్య చేయి పట్టుకుని ఆపి, 'వద్దు. కూర్చో' అన్నాడు.

"ఏంటలా చూస్తున్నారు? కొత్తగా?" ఆమె అడిగిన దానికి బదులు చెప్పకుండా

"మనం హనీ.మూన్ వెళ్దాం సౌఖ్యా" అన్నాడు అకస్మాత్తుగా.

కళ్ళు విప్పార్చి చేసి ఆశ్చర్యపోతూ "నిజంగా?' అని అడిగింది నమ్మలేనట్లు

"నిజం"

"ఏ ఊరు"?

" ఏఊరు? ఏ రైలు? అనడక్కు. ఏ దేశం, ఏ విమానం అని అడుగు"

ఈసారి ఆమె ఆశ్చర్యం రెండింతలైంది.

"నాతో సరదాగా గడపటం నీకిష్టం కదా. అందుకే ఈ హనీ మూన్. నీ ఇష్టాలన్నీ తీర్చాలను కుంటున్నాను ఇక"

ఆఖరు మాట అంటుండగా అప్రయత్నంగా అతని స్వరం వన్నగా వణికింది.

వాషింగ్ టన్ లోని ఓ ప్రముఖ యూనివర్శిటీ హాస్పిటల్లో, ట్రాన్స్ ప్లాంట్ సర్జరీ ద్వారా ఆమె వ్యాధికి చికిత్స చేయించాలనే ప్రయత్నం గానే హనీ మూన్ పేరుతో, ఆమెను బయలుదేర దీస్తున్న సంగతి ఆమెకు చెప్పకూడదనే నిశ్చయిం చుకున్నాడు రాజశేఖర్.

తనను సుఖ పెట్టాలనీ, సంతోష పెట్టాలనీ నిజాయితీగా కోరుకుని, ఆమె జీవితాన్ని తనకు కానుకగా ఇచ్చిన దానికి బదులుగా, తనకున్న ఆస్తి సంతా ఖర్చుపెట్టి, అవసరమైతే తనని తాను చంపుకుని, దాన్ని ప్రమాద వశాత్తూ సంభవించిన మరణంగా భ్రమపెట్టి, తన శరీరంలోని కాలేయాన్ని ఆమెకు ట్రాన్స్ ప్లాంట్ చేసేలా ఏర్పాటు చేసినా, ఆమెను బ్రతికించాలన్న సంకల్పం క్షణ క్షణానికీ బలంపుంజుకుంటోందతనిలో!!

'ఇవ్వటం'లో ఉండే హాయి– ది జాయ్ ఆఫ్ గివింగ్– ఇప్పుడిప్పుడే తెలుస్తోన్న భావన!!

సౌఖ్య చెప్పిన మాట మరోసారి గుర్తు తెచ్చుకున్నాడు.

"నీ విలువా, ఔన్నత్యం,
నువ్వు 'పొందిన' వాటి ద్వారా గుర్తించబడవు–
నువ్వు "ఇచ్చిన" వాటి ద్వారానే!!

తన 'వర్త్' ఏమిటో తెలియచెప్పడం కోసం, తన శరీరంలోని ఓ అవయవాన్నే 'ఇచ్చేయడం' కోసం అతని మనసు తపన పడ్తోంది!! ఉద్విగ్నతతో, అతని పెదవులు అస్పష్టంగా ఉచ్చరించాయి.

OUR WORTH IS NOT MEASURED BY WHAT YOU HAVE GOT BUT BY WHAT YOU GIVE




"నిన్ను పెళ్ళి చేసుకోబోయే అమ్మాయి పెళ్ళికి ముందే విడాకుల పత్రం సంతకంచేసి ఇయ్యాల నడం ఏమీ బాగోలేదు బాబూ. అందులోనూ నీ ఒత్తిడి లేకుండా తన స్వబుద్ధితో సంతకం పెట్టి నట్టు రాయమంటున్నావు"

"ఏం, ఎన్నికలలో టిక్కెట్టు యిచ్చేముందే అలా రాజీనామా పత్రాలు రాయించి తీసుకోవడం లేదూ"

– వి.వి.శీతారామదాసు, గుంటూరు.